బలి

రచయిత:

గూడా కృష్ణమూర్తి

బోధిసత్త్వుడు ఒకానొక జన్మమందు చక్రవర్తి కుటుంబమునందు జన్మించి వంశానుక్రమణిక చేతనూ, యోగ్యతచేతను చక్రవర్తియయ్యెను. ఈతని పరిపాలనమందు రాజ్యమంతయు బహుశాంతముగ నుండెను. సామంతరాజులుగాని విదేశరాజులుగాని ఎదురుతిరుగక, ఎత్తిరాక లొంగియుండిరి. కావున ఏకచ్ఛత్రాధిపత్యముతో, ఆపదలుగాని ప్రజాపీడగాని రాజ్యమందల్లరుగాని లేకుండా రాజ్యమేలుచుండెను. విదేశచక్రవర్తులెల్లరు ఎక్కువ మైత్రిగా నుండిరి. ఈతనికీర్తి దిగంతముల వ్యాపించెను. నిష్కామకర్ముడై, యరిషడ్వర్గములను, తాపత్రయములను, ద్వంద్వములను, బహిఃప్రపంచ శత్రువులను ప్రేమచేత నిగ్రహించి, ప్రజాహిత సౌకర్యమే నిజసుఖముగ భావించెను. 'యథా రాజా తథా ప్రజా' యను లోకోక్తి ననుసరించి రాజెట్లాచరించిన ప్రజలట్లాచరింతురను మానవప్రకృతి నెఱింగి ధర్మమేజయమను పరమావధిగల్గి రాజయోగియని ప్రసిద్ధిగాంచెను. అందువలన ప్రజలకు మోక్షమార్గము లభించుటకొఱకై తాను సక్రమముగ మతవిషయమున నియోగింపబడిన ధర్మము లాచరించుచు, మోక్షసాధనకార్యములన్నియు ననుసరించుచుండెను. బీదలకు ధర్మము చేయుట, నైతికశీలమునకు ఆదర్శనీయుడగుట, ఓరిమితో జీవరాసుల నాదరించుట, ధర్మకార్యదీక్ష, హృదయమున ప్రేమ, శాంతము, ప్రజాసేవ జూచినచో ఆతనినిమూర్తీభవించిన ధర్మదేవతయనక తప్పదు.

ఇంతజాగరూకతతో ప్రవర్తించుచు రాజ్యమును రక్షించుచున్నను ప్రజాదుష్కృతిచేతనో, అవినీతివలననో, వరుణుని పరాకుచేతనో తనరాజ్యమందు కొన్ని పరగణాలలో అనావృష్టిదోషము సంభవించి యపరిమితమగు ప్రజాపీడగలిగెను. చక్రవర్తి, తానెంత జాగ్రదావస్థకల్గియుండినను, తన యపకృతివలననో, నిజముగా ప్రజానీతి భంగమగుట వలననో నిట్టి యనావృష్టిదోషముకల్గి పంటలులేక ప్రజలకు పీడ, క్షామము సంభవించినది అని హృదయావేదనకల్గి, మతగురువులను, పండితులను, పురోహితులను, మంత్రులను, విద్యాప్రౌఢులగు బ్రాహ్మణోత్తములను, స్వాధ్యాయవేత్తలను రావించి వారితో త్వరలో దేశక్షామనివారణకును, వరుణదేవుడు ప్రసన్నుడగునటులను నేదైన నొక్క తరుణోపాయము యోజించి తెల్పవలెనని చెప్పెను. వారు వేదశాస్త్రములను పరిశీలించి వేదోక్తమగు నొక భీకరక్రతువును చేయవలసియున్నదని తెల్పిరి. ఆ మహాక్రతువున ననేకజీవులు బలియైనగాని యనావృష్టి దోషము తొలగదని ఏకగ్రీవముగ ఘోషించిరి.

ధర్మస్వరూపుడగు చక్రవర్తికి వేదోక్తమగు మహాక్రతువిధానము వినినతోడనే, యపరిమిత పారావారపరితాపము జనియించి, దయాళులగు చక్రవర్తులు లోకమున కిచ్చు కానుక యిదియా! యని ఖిన్నుడై మూర్తీభవించిన ధర్మమూర్తి గనుక తనసంతాపమునంతయు దిగమ్రింగి మానసమున యాక్రతువున కియ్యకొనక పైకి మంత్రి, సామంత, బ్రాహ్మణోత్తముల యుపదేశము నిరాకరించినట్లు గానరాక మఱియొక రాజకీయ విషయముపై సంభాషణ మరల్చజొచ్చెను.

వా రీతని హృదయావేదన గానజాలక మతవిషయమై నీతనితో చర్చించుటకిదే యదనని భావించి, క్రతువుయొక్క ప్రాముఖ్యతను, రాజధర్మమును, బ్రాహ్మణధర్మముయొక్క పద్ధతులను వేదప్రాశస్త్యమును

80

గూర్చి చక్రవర్తి ఏసంభావనలోనున్నను నిటులే ప్రశంసింపసాగిరి. “దేవరవారు సమస్తరాజకీయ విషయములందును, ప్రజాక్షేమముకొరకై యొనర్చెడి సేవయు, ధర్మదీక్ష, దాక్షిణ్యము నిరుపమానములు. ధర్మార్థకామమోక్షములు, అపరిమితమైపుణ్యముతో నిర్వర్తించి ప్రజాసంరక్షణజేయు మహాప్రభో! మానవలోకమునకును దేవలోకమునకును వారధివలె సంబంధించియున్న క్రతువును నెరవేర్చుట ధర్మమే. మీయాజ్ఞయే ధర్మమని యెంచు సామంతులెల్లరును, మీరేది నియమించిన అది నిర్వర్తించుటకు సిద్ధముగా నుందురు. ఈక్రతువును చేసి, ప్రజలను రక్షింపగల్గిన ధర్మమూర్తిమీరే. మీయొక్క ధర్మదీక్షకు, సత్యపరిపాలనకు నిదర్శనముగ, నీక్రతువాచరించినచో దేవలోకము తప్పక ప్రసన్నమగును. దేశమందుగల క్షామబాధ తొలగిపోవును. మీకీర్తి దేదీప్యమానముగ కోటిభాస్కరతేజముతో యసమానముగ నుభయలోకముల వ్యాపించును. మీరు పవిత్రులగుటచే నిట్టి కార్యదీక్షగొనుటకు తగిన శీలము, యుదారబుద్ధి, సత్ప్రవర్తనము, ధర్మము యనువులకు దుర్గ్రాహ్యము. కాన యీక్రతువును యాచరించిన దేవఋణవిముక్తులు కాగలరని వేదములు ఘోషించుచున్నవి. దేవతలు సంతసిల్లి నిర్దోషముగ క్రతువును యాచరించిన అనావృష్టి తొలగి సుభిక్షముగానుండును. ప్రజాసౌకర్యమునకై కంకణబద్ధులైన మహారాజా! మా ప్రార్థన నాలకించి యీక్రతువు నాచరించి యాచంద్రతారార్కముగ యశస్సును బడయ వేడుకొనుచుంటిమి.”

ఇంతదనుక మూర్ఖతవహించి వేడుకొనుచున్న బ్రాహ్మణోత్తములయందు విశ్వాసముంచి వేదప్రమాణము నిరసించకుండ వారివల్లనే ధర్మసంరక్షణకు భంగమురాకుండ నుండునటుల ప్రవర్తించవలయునని రాజుయోజించసాగెను. ప్రపంచమున ఎవరైన ఒక విషయమున యధికులని విశ్వాసముంచి వారికి శరణుజొచ్చితిమేని వారే ధర్మశాస్త్రానుసారముగా కుతర్కములవలన లోకమునకు హానిచేకూర్చుటకలదు. అట్టి కుమార్గములను, కుతర్కములను వివేకములేక యనుసరించుచో పాపమార్గ మాచరించి సత్యమార్గ మదియే యని భ్రమచెందగలరు. నిజముగా యోజించినచో ధర్మమునకును, జీవహింసకును ఏమైన సంబంధమున్నదా? దేవలోకవాసులగు పుణ్యమూర్తులు కాంతించి ప్రసన్నులగుటకును, పాపకార్యమగు జీవహింసకును ఎంతవరకు సంబంధమున్నది? వేదమంత్రోచ్చారణవలన యజ్ఞపశువునకు ఆవేదమంత్రములే బాణములవలె తగిలి ఆపశువు మరణించి స్వర్గమున ప్రవేశించుననియు, అటుల స్వర్గారోహణచేసినందువలన సమస్తమగు ఇహసౌఖ్యములు చేకూరునని తెల్పుచుండిరి. ఇందు వేదప్రామాణ్యము జూపుచు కుతర్కములవలన అది న్యాయసమ్మతమని ధర్మమని వాదించుచున్నారు. కాని యిట్టిది సంపూర్ణముగ నిందార్హము, సత్యదూరము, అధర్మము, యనృతము. లోకాంతరమందు యితరులు చేసిన కర్మఫలితము, కర్మానుభవమును పొందిన జీవికెట్లు చెందును? యజ్ఞపశువును మానవులు హింసించినచో, ఎవరాహింస చేయించిరో, ఎవరుచేసిరో వారు ఆచేసిన పాపపుణ్యకర్మలననుభవింతురుగాని యజ్ఞపశువు సంచితపూర్వకర్మనంతయు త్రుంచికొని స్వర్గార్హమెట్లగును? యజ్ఞమందు బలికొఱకు తేబడినప్రాణి, యనేకక్రూరకర్మలు చేయుచు, హింసామార్గమునయుండి, ఎన్నడును సత్ప్రవర్తనకుగాని ధర్మమార్గమునకుగాని నోచుకొనకపోయినను, యజ్ఞమునందు బలియీయబడినంతమాత్రమున నిజముష్కర్మయంతయు మాసిపోయి పుణ్యాత్ములు పతితులు నివసించు పుణ్యలోకముల కెట్లర్హమైనది? నిజముగా యజ్ఞమందు సమర్పింపబడిన ప్రాణియే స్వర్గమలంకరించుట సత్యమేయగుచో పవిత్రమగు వేదప్రమాణములుగలిగి ప్రస్తుతము యనేకవేల జీవులను బలియియ్యవలెనన్న వారలెవరైన, ఆస్వర్గలోకమున పొందుటకు యీయజ్ఞమందు నరబలిని నియమించి, ఏ బ్రాహ్మణోత్తముడైన తానే యజ్ఞపశువుగానుండుటకెందుల కియ్యకొనరాదు? ఏస్వర్గసౌఖ్యముకొరకు యప్సరాంగనల

పొందుకొరకు కాంక్షించి యజ్ఞము సల్పుచున్నారో, అట్టివారలు సుఖముగను, సులభముగను స్వర్గ ద్వారమున పొందగలరుగదా? కావున యోజించిన యీజీవహింస హేయము. ఇంత పాపకార్యమును నెంత యుత్తమ బ్రాహ్మణుడు చెప్పినను, యవివేకినై ఎట్లు శిరసావహించగల్గుదును. ఇదే ధర్మ మార్గమా? అదిగాక దేవతలందరూ చక్కని సుగంధములో పరిమళించుచూ, రసవంతమై కష్టపడి సంపాదింపబడి యప్సరోజనములు యానందముతో పంచి పెట్టుచుండు, "యమృతము"ను వదిలివేసి, కనికరింపదగిన జీవుని, హేయమై, నికృష్టమగు పశువును యజ్ఞమందు కఠినముగ, బలవన్మరణము చెందిన శరీరమందలి 'వప'ను యితరావయవములను యాశించుదురనుట పరమేశ్వరునికి కళంకమేర్పరుచుటయే యని లోలోన తర్కించుకొని జీవహింసలేని మార్గమునకై వెదుకజొచ్చెను.

అటుల తలపోసి బ్రాహ్మణోత్తముల కియ్యకొననట్లు కానుపించినచో వారు నొచ్చుకొందురని, వారు బోధించు క్రతు విషయమంతయు శ్రద్ధగా వినుచు ఇట్లు జవాబిచ్చెను.

"బ్రాహ్మణోత్తములారా! నాశక్తి సామర్థ్యములు యతిశయోక్తిగ వర్ణించినందులకు, మీ యాశీర్వాదమునకు కృతజ్ఞుడను. మీరు యేర్పరచిన క్రతు విధానమునకు యొప్పుకొంటిని. మీ యాశీర్వాదము ఫలించుగాక! యీ క్రతువును "పురుషమేధ"మని పిలువవలెను. అందు ఒక వెయ్యిమంది మనుష్యులు యజ్ఞమునందాహుతియగుట యవసరము. కాన సభ చాలించి క్రతువునకు వలయు సంభారముల నన్నిటిని చేకూర్చి సిద్ధపరుపగోరెదను. మంచి సుముహూర్తమునుంచి యనేకదినములు జరుగు యజ్ఞమునకు తగిన స్థలము నిర్దిష్టించి యజ్ఞశాలను నిర్మింపగోరెదననెను.

అందు నొక పురోహితుడులేచి 'మహాప్రభూ! యజ్ఞదీక్షానంతరము తక్షణమే దేవరవారు అవభృత స్నానమాచరించవలెను. అనంతరము క్రమక్రమముగా నొకరినొకరినే బలియీయవచ్చును. ఏలనన వెయ్యిమంది ప్రజలను ఒక్కసారి బలియిచ్చినచో ప్రజలు మిమ్ములను, మమ్ములను నిందింతురు. దేశమందు తిరుగుబాటు, విప్లవము చెలరేగవచ్చున'ని యొలుగెత్తి చెప్పెను. మిగిలిన బ్రాహ్మణులందరు యీతని యుపాయము బాగున్నదని విన్నవింపదొడగిరి. అంత చక్రవర్తి లేచి, బ్రాహ్మణోత్తములారా! ప్రజల తిరుగుబాటునకును, విప్లవమునకును మీరు యులజడి పడి జడియవలదు. అటు ప్రజాశాంతికి భంగకరములగు కార్యములు జరుగకుండ తగినప్రయత్నములుచేసి సంరక్షించు బాధ్యత నాది" యని సభముగించెను.

తదనంతరము చక్రవర్తి తన రాజ్యమందంతటను గలప్రజలనురావించి ఒక గొప్ప మహాజనసభయందు "మహాజనులారా! నేను పురుషమేధమను మహా క్రతువును ప్రజాక్షేమమునకై తలపెట్టితిని. అందు వేయిమంది మనుష్యులను బలియీయవలెను. ఎవరు ధర్మప్రవర్తనగలిగి న్యాయముగ సంచరించెదరో, వారు ఆబలికి పనికిరారు. ఎవరు నైతికమార్గమునుండి మరలి, కుమార్గముల ప్రవర్తించెదరో, నా యీయాజ్ఞను యుల్లంఘించెదరో, వారు దేశద్రోహులనియు ప్రజాశత్రువులనియు నెంచబడి యజ్ఞపశువుగా పట్టుకొనబడుదురు. ఇందుకువలయు చారులను నియమించియు, నేను స్వయముగానూ సమస్తమును తెలిసికొందును. కాన జాగరూకతతో ధర్మమార్గమును గుర్తెరింగి మెలగవలెనని" తెల్పెను.

అంతట ఆ మహాసభలో నాయకులగువారు ముందరకువచ్చి చేమోడ్చి నమస్కరించి- 'మహాప్రభో! మీరు ధర్మస్వరూపులు. ప్రజాక్షేమమే తమ క్షేమమని యెంచు మహాత్ములు. అటువంటి రాజయోగులగు ప్రభువుల యాజ్ఞ శిరసావహించకపోవుట సంభవమా! పరమేశ్వరుడైనను తమయందు నేరము లెంచలేడు. న్యాయమూర్తులు. ధర్మదేవత మిమ్మాశ్రయించినది. సత్యసామ్రాజ్యము మీది. కాన తమ రేయాజ్ఞనిచ్చిన నయ్యది శిరసావహించుటకు బద్ధులమని చెప్పి సభముగియగానే వెడలిపోయిరి. తదనంతరము దేశ

మంతటను చారులను నియమించి దేశదేశములలో ప్రతిగ్రామమందున 'ప్రజలలో ధర్మాత్ములను, సత్ప్రవర్తనకల్గిన వారిని సంరక్షించుటకు కంకణబద్ధులము. మేము చేయబోవు 'పురుషమేధ'మను క్రతువునకు యవినీతిప్రవర్తనగలవారిని సామంతప్రభువులైనను విచక్షణలేక దుష్ప్రవర్తనగలవారిని పట్టుకొని యజ్ఞయూపమునకు బంధించి, ఆమహాక్రతువులో బలిగా సమర్పించెదమని' సాటింపించెను.

ఎప్పుడీఘోరమైన సాటింపు దినదినము ప్రజలు వినసాగిరో, చారులు ప్రతిగ్రామమందును గానరైరో యాటినుండి ప్రజలు రాజశాసనమును ఏమాత్రము వ్యతిరేకించక యవినీతికి చోటీయక సత్ప్రవర్తనతో మెలగుచుండిరి. ఈర్ష్య, శత్రుత్వము ఎచ్చటను గానరాకుండెను. తమకున్న తగవులను పరస్పరాంగీకారమువలన సర్దుపాటు చేసుకొనుచుండిరి. కృతయుగమందువలె తలిదండ్రులయెడ గురువులయెడల భక్తికల్గి విశాలహృదయముగలవారై పశుపక్షిజీవులను యాదరణలో జూచుచు దయాశాలులై, యణకువ నమ్రతగల్గి మెలగుచుండిరి. మృత్యువుయొక్క భయముచేత లోకాంతరప్రపంచముయొక్క విచారణ ప్రారంభించి తెలిసికొనుచుండిరి. ఎవరికివారు తానొకడు బలియయ్యెనేని, తనవంశమునకు అపకీర్తియనియు, తనకు అవమానకరమని చింతించుచుండిరి. ఇంత పరివర్తన ప్రజలలోకలిగి సత్యసామ్రాజ్యమైనను చారులు తిరుగుట మానలేదు. నీతిమార్గములను కూడ బోధించుచుండిరి. ఇంత ధార్మికబుద్ధి, న్యాయము, సత్యము రాజ్యమందు ప్రబలియున్నదని విని చక్రవర్తి చాల యానందించెను.

ఇట్టి యానందదాయకమగు వార్తలు చెప్పిన చారులను బహూకరించి, మంత్రి సామంత బ్రాహ్మణాదులను రావించి రాజు—

“నాప్రజలను సంరక్షించుట, జీవహింస నిర్మూలముచేయుట నాపరమావధియని మీకు విదితమే. యజ్ఞమునకు సమకూర్చిన ధనము యపరిమితముగానున్నది. ధర్మప్రవర్తనగల మనుజులెవ్వరును బలియిచ్చుటకు యర్హులుకారుగదా! మానవులనెవ్వరినైనను బలవంతముగ దెచ్చి యాహుతిచేయుదుమా, యిట్టి న్యాయమగుపరిస్థితులలో, నైజస్వభావముచే మానవుడు స్వాతంత్ర్యమునకై పోరాడి దేశమున సంక్షోభముకలుగజేయును. అందులకు మనుజులకు శక్తిసామర్థ్యములున్నవి. ధర్మాసక్తిపరులైనప్పుడు బలియన్న నియ్యకొనరు. చావునకు వెరచి ముందంజవేసి యీబలివలన స్వర్గము చేకూరునను విశ్వాసము సత్ప్రవర్తకులకు లేదు. వారు ధర్మమార్గము, సత్ప్రవర్తనయే మోక్షమార్గమని తలంచుచున్నారు. ఈయజ్ఞమును తలపెట్టిన బ్రాహ్మణోత్తములెవ్వరైనను ప్రజాక్షేమమునకై మృత్యుభయమును త్యజించి యిహసౌఖ్యముల విడనాడి, బలియీయబడుటకై, తమంతటతాము ముందంజవేసి సమర్పించుకొనుటలేదు. జంతువులన్నో నోరులేక మనుజులేమిచేసినను అందుకు లొంగిపోయి యుండుటవలన మనము స్వాతంత్ర్యము తీసికొని హింసించుటకు సాహసించుచుంటిమి. నిజముగా తిరుగుబాటు స్వభావముగల్గియున్నచో వాటిని హింసించుటకు సాహసించము. అయ్యవి మనలను నిగ్రహించి పశుత్వమును కనపర్చును. జీవము బ్రహ్మాదిపిపీలికాదులపర్యంతము ఒక్కటే. శక్తిసామర్థ్యములు లేకపోవుటచే యనేక కుతర్కముల వలన నిట్టిహింస మనము కడగుచుంటిమి. జీవరాసి యంతయు నొక్కటేయని భావించగల మనుష్యుడు తానెందుల కాహుతి బొందలేడు. యజ్ఞపశువునకు ఆహుతి యనంతరము స్వస్వరూపమును బొందజేయగల్గు యగ్నిహోత్రుడు మనుజునకు కలుగజేయలేని శక్తిహీనుడా! అట్టి స్వర్గలోకమును బలవంతముగ పశువుచేత నేల బొందింపవలయునా? స్వర్గసుఖమును సంపూర్ణముగ గుర్తెరిగిన మనుష్యుడేల యవలికాలములో బొంది మోక్షమును బొందరాదు. స్వర్గలోకమున కూడ నిట్టి యింద్రియవాంఛగల మనుజుడు యజ్ఞము చేసి మరియొకజీవిని హింసించి పుణ్యలోకమునగూడ హేయసుఖములబడయు నీచత్వముకంటె తానే యజ్ఞమందాహుతిజెంది శాశ్వతముగ స్వర్గలోకమును

పొంది బ్రహ్మానందమునం దోలలాడరాదా! ధర్మమూర్తులు, సత్యస్వరూపులు రెట్టులైన పరలోక సుఖములను సాధించగలరు. జీవహింసవలన నెవ్వరును సాధించలేరు. సృష్టియొక్క ఆదర్శమే 'అహింసాపరమోధర్మః'యని స్థాపించినద్విజులు ఆమార్గము నేల త్యజించవలెను. కాన ప్రస్తుతము చేకూరిన ధనమువలన మనకు జీవహింస యక్కరలేకయే యజ్ఞము కాగలదు.ఎచ్చట ధనలేమిగలదో వారి కీధనమంతయు ఇచ్చినచో వారి దారిద్ర్యము తొలగగలదు. ప్రస్తుతము మనమవలంబించు ధర్మమార్గమువలన దేశములు సంతసిల్లి బాధ, క్షామము, అనావృష్టి తొలగింపగల్గుదురు'' యని తెల్పినప్పుడే కుంభవృష్టిగ వర్షించినందువలన, ఆపరమేశ్వరు డెంత దయాసముద్రుడో, ఎంతధర్మపరిపాలకుడో, ఆకరుణాసముద్రునికి సృష్టిలో భేదమాత్రంతయైన ఎట్లు లేదో తెలియుచున్నది. కాన నీవిధముగ దేశమందు పాటింపించి ధనమును వినియోగపర్చవలెనని యాజ్ఞాపించెను.

చక్రవర్తి ధర్మబుద్ధికి, బ్రాహ్మణులు తలలొగ్గి 'ధర్మము, సత్యము' యొక్క యుచితజ్ఞత గుర్తించి జీవహింస పాపమని తెలిసికొని మంత్రులచే నీయబడు ధనమును సేకరించి యానందించిరి. ఆధనముతో ప్రతి పల్లెయందును, పట్టణమందును ధర్మశాలలు స్థాపించి ధనమును పంచిపెట్టి సుభిక్షమును చేకూర్చిరి. ధర్మప్రాబల్యముచే దుర్భిక్షము తొలగినది. చక్రవర్తికీర్తి పుష్పసౌరభమువలె పలుదెసల ప్రాకినది. ప్రజలందరు, చక్రవర్తియొక్క అహింసాతత్వమును యచ్చరువంది, సత్యమువలనను, ధర్మమువలనను యిహపరసౌఖ్యములు చేకూరునని నమ్మి, సుభిక్షముగల్గి, పంటలుపండి, వ్యాధిబాధలేక సుఖజీవనము చేయుచుండిరి. ప్రజలందరును చక్రవర్తికి యనేకములు కానుకలనుయిచ్చి దేశపరిస్థితులను, ప్రజాసౌఖ్యమును తెల్పుచుండిరి.

ఒకనా డొకరాజోద్యోగి కొలువునందు చక్రవర్తితో- 'మహాప్రభూ! చక్రవర్తులు పండితులతోనూ, పామరులతోనూ, వర్తకులతోనూ, సమస్త ప్రజలతోనూ యేదోయొక సంబంధముండి పొందిన యనుభవమువలననే వారిబుద్ధిచాతుర్యము వర్ణనాతీతము. తమరు యజ్ఞదీక్షను ధర్మదీక్షయునినందువలన సమస్త యజ్ఞయాగాది క్రతువులు, ధర్మమందును, సత్యమందే కలవు. స్వలాభాపేక్షకొరకు జీవహింసచేయుచు, వేదప్రమాణమును కుతర్కమువలన హింసారూపకముగ మార్చుట యధర్మమని, యసత్యమని ప్రజలు ప్రత్యక్షముగ తెలిసికొనిరని' నుడివెను.

కాన ఎవరిహృదయము పవిత్రమైనదో, నైర్మల్యము లేనిదో వారు ఎన్నటికిని కుతర్కమునకుకాని, కుజనులయొక్క దుర్బోధవలనగాని, యన్యాయమునకుగాని, యసత్యమునకుగాని, తావీయక ధర్మమార్గమున లోకకళ్యాణమును చేకూర్చగల్గుదురు.

—జాతకకథలనుండి.

“ఆంధ్రా హోమ్”

నెం 61. లజ్ చర్చిరోడ్డు మైలాపూర్, మద్రాస్.

ఆంధ్రులకు రుచికరమైన వంటలతో భోజనవసతి, బసలుకలవు. కుటుంబములతోనున్నవారికి ప్రత్యేకగదులు. కలితిలేని కాయగూరలు, వేయించినకందిపప్పు, ఆరోగ్యకరపువేర్పాటులు, స్నానమునకు వేడినీటిసదుపాయములు, ఎలక్ట్రిక్ దీపములు. పండుగవిందులు చేయబడును. ఒకసారి దయచేసి చూడండి.

ఆంధ్రాహోమ్, మైలాపూర్, మద్రాస్.